# శ్రీ రమణ జ్యోతి

సంపుటి-44 సంచిక - 5 హైదరాబాదు మే, 2024 పేజీలు - 52 రూ. 10/- సంవత్సర చందా : రూ. 100/-

# SRI RAMANA JYOTHI

Vol - 44 Issue - 5 Hyderabad May, 2024 Pages - 52 Rs. 10/- Annual Subscription Rs. 100/-



**BHAGAVAN SRI RAMANA MAHARSHI**



*ARUNACHALA HILL* (అరుణాచల గిరి)

స్మరణమా త్రముననె పరముక్తి ఫలద । కరుణామృ తజలధి యరుణాచ లమిది ॥

శ్రీ రమణ జ్యోతి
మే 2024

**Sri Ramana Jyothi**
May 2024

ఈ సంచికలో ...
IN THIS ISSUE ...


**1. డా॥ కే.యస్. గారి 118వ ప్రవచనం** — డా॥ వి. రామదాస్ మూర్తి 3

**2. శ్రీ రమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు** — శ్రీమతి మల్లాది ఫణిమాల 13

**3. కాళీవిద్య** — శ్రీమతి అయ్యల సోమయాజుల రేణుక 18

**4. శ్రీ భగవాన్‌తో గ్రిద్దలూరి కుటుంబం అనుబంధం** — శ్రీ గ్రిద్దలూరి కృష్ణమూర్తి 24

5. The Ordinary is Extraordinary — Dr K Subrahmanian 30

6. Ashtavakra Gita 24 — V Krithivasan 36

7. Maha Nirvana — SS Cohen 42

8. Mother Azhagammal — Sneha Choudhury 46


**Events in Sri Ramana Kendram in May 2024**

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 13th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
4. Sri Bhagavan's 74th Aradhana - 6th May
5. Mahapuja - 31st May

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# గొప్ప గురువులకూ జబ్బులు వస్తాయి

డా॥ కే.యస్. గారి 118వ ప్రవచనం

అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి

సాధారణంగా మనకు ఏదో ఒకటి కావాలన్న కోరిక వుండనే వుంటుంది. వస్తు సంపద, ఉద్యోగం, ఆరోగ్యం, ఏదైనా కావచ్చు. ప్రాథమిక దశలలో, దాని కోసం, గురువును ప్రార్థిస్తాం. కొన్ని సందర్భాలలో కోరుకున్నది లభిస్తుంది. అప్పుడు, గురువు మీద నమ్మకం పెరుగుతుంది. గురువు ఎంతో గొప్పవాడని మెచ్చుకుంటాం. కొన్నాళ్ళ తరువాత, మనం అడిగిన ప్రతిసారీ, ఆయన మనం కోరినది యివ్వడంలేదని గ్రహిస్తాం. అప్పుడు ఎవరో వచ్చి, యింకొక గురువు అద్భుతాలు చేస్తాడని చెబుతారు. అప్పుడు, ఆ గురువు దగ్గరికి వెళ్తాం. ఆయన ఎప్పుడూ మనకు కావలసినది యిస్తాడనుకుంటాం. అక్కడా, మునుపటి గురువు వద్ద జరిగిన అనుభవం లాంటిదే కలుగుతుంది.

అలాగ, మళ్ళీ మళ్ళీ గురువులను మార్చడం జరుగుతుంది. అంటే, మొదటి దశలలో, మనం గురువు వద్దకు వెళ్ళేది ఉపదేశం కోసం కాదు, కోరికలు తీర్చుకోవడమనేదే మన ఏకైక ఉద్దేశం. తెలిసో, తెలియకో, గురువు మనము అడిగినది యిచ్చి తీరాలన్నట్లు, ఆయన మనకు యించుమించు విధేయుడిగా వుండాలన్న ధోరణిని ప్రదర్శిస్తాం. మిమ్మల్ని పూజిస్తున్నాం, గౌరవిస్తున్నాం కాబట్టి, మాకు కావలసినది ఎక్కడ? అన్నట్లు ప్రవర్తిస్తాం. గురువులు పక్షపాత

ధోరణిని కలిగి వున్నారేమో అన్న అనుమానం కూడా మనకు వస్తుంది.

## భగవంతునిపై ధ్యాస

ఇక ఆ రకంగా ప్రయత్నాలు సిద్ధించనప్పుడు, భగవంతుని మీదకు ధ్యాస మరలుతుంది. పూజ, జపం, ధ్యానం మొదలైన వాటిని మొదలుపెడతాం. దేవాలయాలను దర్శించడం, పుణ్యక్షేత్రాలకు వెళ్ళడం లాంటివి చేయడం ద్వారా, మన కోరికలు తీర్చుకోవడానికి ప్రయత్నిస్తాము. ఒకరు కార్తికేయ స్వామిని ప్రార్థించమంటే, యింకొకరు వేంకటేశ్వర స్వామికి మొక్కుకోమంటారు. అలాగ, దేవుళ్ళ మార్పు సాగుతుంది. వాంఛించినది పొందడం ఏ విధంగానూ సాధ్యం కాదని, నిస్పృహ చెందుతాం.

ఇలాగ, అన్ని ప్రయత్నాలు చేసిన తరువాత, యిది నా ప్రారబ్ధం అని నిశ్చయించుకుంటాం. బాధలు ఏవి వచ్చినా, అవి ప్రారబ్ధ ఫలితమేనని అనుకుంటాం. అలాగ అనుకున్నంత మాత్రాన ఊరట లభించదు. కొంతమంది, యింకొకసారి ప్రయత్నించి చూద్దామని, మళ్ళీ గురువును ఆశ్రయిస్తారు. ఇక, గురువు ఏదో జబ్బుతో బాధపడుతున్నాడని తెలిస్తే, తన జబ్బునే తాను నయం చేసుకోలేని వ్యక్తి, నా బాధలు తగ్గిస్తాడా అన్న పెను సంశయాలు మొదలవుతాయి. ఇవి సాధారణంగా జరిగే విషయాలే అని, బయటకి చెప్పుకోవడం అపచారంగా భావిస్తారు. అలాంటి వారిపై

నమ్మకం సన్నగిల్లుతుంది. కాని, విషయమేమిటంటే, సాధారణ గురువులు, కొందరు మహాత్ములు, జీవితంలోని హెచ్చు తగ్గులను ఎదుర్కొనవచ్చని తెలుపుతారు. మీరు ధైర్యంగా వుండాలి, గట్టి పట్టుదల, సంకల్పం కలిగి వుండాలి, అప్పుడే విజయవంతులవుతారు అని చెబుతూ పోతారు. ఒక్కొక్కసారి, అవి ఫలించవచ్చు, ఫలించకపోవచ్చు.

**జీవితం కాదు, మరణం**

నిజమైన గురువు, జీవితాన్ని కాదు, మరణాన్ని ఎలా ఎదుర్కోవాలో బోధిస్తాడు. జీవితంలోని ఒడిదుడుకులను ఎలా ఎదుర్కొని విజయవంతులు కావాలో చెప్పేవారు కూడా, ఒక విధంగా మంచివారే. ఒకసారి మరణం యొక్క ప్రాముఖ్యతను తెలుసుకున్న యథార్థ గురువు, తనను బాధిస్తున్నాయనుకునే వ్యాధులను నయం చేసుకునేందుకు, ఆసక్తి చూపడు. ఆయన శరీరంతో మమేకం కాడు. మనబోటి వారి మనసులలా వారి మనసు వుండదు. మరో మాటలో చెప్పాలంటే, మరణాన్ని జయించడం వారికి తెలుసు. వారికి మరణ భయం వుండదు. అలాంటప్పుడు, తమ జబ్బును నయం చేసుకోవాలన్న ఆదుర్దా వారికెందుకు వుంటుంది?

మరణించకూడదు అనుకునే మనబోటి వాళ్ళు, జబ్బులను నయం చేసుకోవాలని తాపత్రయ పడతాం. ఆ ప్రయత్నంలో, శరీరాన్ని కాపాడుకోవడం గురించి తీవ్రంగా ఆలోచిస్తాం. శరీరాన్ని

ఎప్పుడో ఒకప్పుడు వదిలివేసే సమయం వస్తుందని మనకూ తెలుసు. జబ్బు చేస్తుంది, కోలుకుంటాం. అప్పుడు, స్నేహితులకు, బంధువులకు, జబ్బునపడి కోలుకున్నానని, భగవంతుని దయ ఎంతో గొప్పది అని తెలుపుతాం. అది నిజమే. కాని, కొందరు, తాము ప్రార్థించడం వల్ల మీకు నయమైందని అంటారు.

జబ్బు నుండి కోలుకున్న తరువాత, దానికి ఎన్నో కారణాలు ఆపాదిస్తాము. మనం చేసిన ప్రార్థనలు, శుభాకాంక్షలు, దైవకృప, అన్నీ దోహదపడ్డాయని అనుకోవడం జరుగుతుంది. కాని, ప్రపంచంలో వున్నవారందరూ ప్రార్థించినా, ఏదో ఒక రోజు, వ్యక్తి మరణించడం ఖాయం. దైవ కృపతో బాగుపడినది నిజమే అయి వుండవచ్చు. కాని, అలాగ కోలుకొనకపోతే, దాని అర్థమేమిటి? నాపట్ల భగవంతుడు దయామయుడుగా లేడు అనా? ఇది మనకందరికీ కూడా వర్తిస్తుంది.

ఏదో ఒకరోజు, భగవంతుడు, మన విషయంలో దయ చూపడు. కాని, భగవంతుడు కరుణా స్వరూపుడు అని అన్నప్పుడు, మనపట్ల ఎందుకు కృప చూపడు? అలానే, గొప్ప జ్ఞానులు ఎందుకు జబ్బులతో బాధపడుతున్నారు? అసలు జ్ఞానుల అసాధారణతను మనం గుర్తుంచుకోవాలి. తమ జబ్బులు నయం కావాలని, వారు కోరుకోరు. వారికి మన వలె, శరీర స్పృహ వుండదు. ఆరోగ్యము, అనారోగ్యములను ఒకే దృష్టితో చూస్తారు. మరణం పట్ల వారి దృక్పథాన్ని మనం అర్థం చేసుకొనకపోవడమే, దానికి కారణం.

## మరణమంటే ఏమిటి?

ఈ మరణమన్నది ఏమిటి? అది, ''అహంకారం'' యొక్క మరణమే. గొప్ప జ్ఞానులకు, మన వలె, వ్యక్తిత్వ భావన వుండదు. మనలాగ అహం వుండదు. అహం నాశనం చెందినప్పుడు, శరీర స్పృహ వుండదు. వ్యాధి యింకెవరికో అన్నట్లు వుంటుంది వాళ్ళ ధోరణి. మరొక విధంగా చెప్పాలంటే, అహం యొక్క నాశనంతో, ఒక సంపూర్ణత్వం వస్తుంది. జీవితం నిండుగా వున్నట్లు అనిపిస్తుంది. మన మనసులు పరిమితమైనందువల్ల, మనం శరీరాలకు పరిమితమై వుంటాము. జ్ఞానుల విషయంలో అలాగ కాదు. వాళ్ల మనసు, మన మనసు వలె విచ్ఛిన్నమైనది కాదు. వాళ్ళు శుద్ధ చైతన్య మూర్తులు. వాళ్లకు సంబంధించినంత వరకు, ఆ చైతన్యం అతి ఉన్నత స్థాయిలో పని చేస్తుంది. మన పరిమితమైన మనసుతో, ఆ శుద్ధ చైతన్య మూర్తులు ఎందుకు బాధపడాలని విచారణ చేస్తాం. కాని, జ్ఞానులు బాధపడరు. అది అసాధారణమైన విషయం.

శ్రీ రామకృష్ణ, భగవాన్ రమణ మహర్షి, జె. కృష్ణమూర్తి - అందరికీ క్యాన్సర్ సోకింది. కంచి మహాస్వామి ఆచార్యుల వారు, దేశం మొత్తం పలుమార్లు పాదయాత్ర చేశారు. రోజులో మూడుసార్లు పూజ చేసేవారు. అలాంటి ఆచార్యులు, తరువాతి రోజులలో, నడవలేక పోయినందువల్ల, అన్ని పనులు ఆపవలసి వచ్చింది. తమ ఆధ్యాత్మిక వారసుడికి అన్నీ అప్పజెప్పారు. అంత మాత్రాన, పూజ చేయలేనందుకు దుఃఖ పడ్డారా? కొన్ని కారణాల వల్ల, చివరి

కాలంలో ఆత్మ ధ్యానం మాత్రమే చేసేవారు. ఆరోగ్యం క్షీణించి నప్పటికీ, ఎవరితోనూ చెప్పుకోలేదు. వారు శరీరానికి అతీతులు.

## గొప్ప గురువులకూ జబ్బులు

శ్రీ రామకృష్ణ పరమహంసకు, గొంతులో క్యాన్సర్ వ్యాధి వచ్చింది. "మీరు రోజు కాళీ మాత దర్శనం చేసుకుంటారు కదా, ఈ జబ్బును నయం చేయమని ఎందుకు ప్రార్థించరు?" అని వారి శిష్యులు అడిగారు. బాలుడి లాంటి మనస్తత్వం వున్న రామకృష్ణులు, దానికి ఒప్పుకున్నారు. మనకందరికీ ఒక పాఠం నేర్పాలని, అలాగ ఒప్పుకున్నారు. కాని, కాళీ మాతను దర్శించి నప్పుడు, ఆ సంగతిని మరచిపోయారు. రెండవసారి కూడా అలాగే జరిగింది. మూడవసారి శిష్యులు, ఈసారి మరవకుండా, కాళీమాతను వారి వ్యాధిని నయం చేయమని కోరుకోమన్నారు.

మూడవసారి అమ్మ దర్శనానికి వెళ్ళినప్పుడు, జ్ఞాపకమున్నప్ప టికీ అడగలేదు. శిష్యులు ప్రశ్నిస్తే, "విశ్వ సృష్టికర్తను, అతి తేజో వంత రూపంలో దర్శించిన వెంటనే, ఆమె సృష్టికర్త కదా! ఆమె చేయలేని పని ఏముంటుంది అని అనిపించి, అలాంటి మాతను, నా వ్యాధిని నయం చేయమని అడగడానికి సిగ్గుపడ్డాను. ఆమె నయం చేయాలని సంకల్పిస్తే, తప్పక వ్యాధి నయమవుతుంది" అని బదులిచ్చారు. శ్రీ రామకృష్ణులది ఉన్నతమైన తీరు. అలాగే, గొప్ప జ్ఞానులు అందరూ కూడా. అహాన్ని నాశనం చేసుకున్న వారు, సంపూర్ణ జీవితాన్ని అనుభవిస్తారు. అహం వున్నప్పుడే, మనకు సమస్యలన్నవి వస్తాయి.

ప్రతి వ్యక్తికీ, ఏవో సమస్యలు వస్తూనే వుంటాయి. కాని, నిజమైన గురువు, సమస్యలను ఎదుర్కొనేందుకు తగిన బలాన్ని యిస్తాడు. శ్రీరామచంద్రుడు, శ్రీ కృష్ణుడు మొదలైన అవతార పురుషులకు కూడా సమస్యలు తప్పలేదు అనేది మన భావన. కాని, మనం ఆలోచించాల్సింది, మనం సమస్యలు అనుకునేవి వాళ్ళు అలా భావించారా? వాళ్ళు, కర్తవ్యాలను సంతోషంగా నిర్వహించారు. ఆ జ్ఞానాన్ని, గురువు మాత్రమే యివ్వగలడు.

మనం నిత్య జీవితంలో నిర్వహించవలసినవి మన శక్తి మేర నిర్వహించాలి. విధులను నిర్వహించడంలో ఏవైనా సమస్యలు ఎదురైతే, గురువు వాటిని ఎదుర్కొనే శక్తిని మనకిస్తాడు. క్రమేపి, మనం కేవలం ఆయన పనిముట్టు మాత్రమేనని, ఆయన కృప వల్ల గ్రహిస్తాము. అప్పుడు, మన భారం తగ్గుతుంది.

**ఏది స్వంతం ?**

మరొక విషయం. జీవితంలో కొన్నింటిని మన స్వంతం అనుకుంటాం. కాని, పోను పోను, వయసు వచ్చేసరికి, అది నిజం కాదని తెలిసివస్తుంది. ఉదాహరణకు, మన పిల్లల విషయం తీసుకోండి. మా కొడుకు, మా కూతురు, అంటూ వుంటాము. అకస్మాత్తుగా, వారు కూడా పెద్దవాళ్ళు అయ్యారని తెలిసివస్తుంది. వాళ్ళకూ తమ స్వంత మనస్సు, స్వంత వ్యక్తిత్వాలు, ఏర్పడతాయి. మనకూ వ్యక్తిత్వం వుండడంతో, ఒక స్పర్థ పుట్టుకొస్తుంది.

అలాంటి సందర్భాలు ఏర్పడినప్పుడు, యిదేమిటి, నేను పెంచి పెద్దచేసిన బిడ్డలే, నన్ను ఎదిరించి, నా మాట వినడంలేదని ఆశ్చర్య పడతాం. ఇది అందరి విషయంలోనూ జరిగేదే! అప్పుడు, ఈ ప్రపంచంలో దేని మీదా మనకు అదుపు లేదని తెలుసుకుంటాం. మన మీదనే మనకు అదుపు లేనప్పుడు, యితరుల మీద, మనకు అదుపు వుండబోదు. అది, భార్య లేదా పిల్లలు కావచ్చు. వ్యక్తికి తనపై పూర్తి అదుపు, దైవం లేదా గురువు యొక్క యిచ్ఛకు పూర్తిగా తలవంచినప్పుడే ఏర్పడుతుంది.

**బంధం, విముక్తి**

బంధింపబడడమన్నది మనకు నచ్చదు. యోగులు, ఋషులు, భగవాన్ రమణ మహర్షి, అందరూ, "ప్రభూ, నన్ను నీ బందీని చేసుకో, అప్పుడు నేను స్వేచ్ఛగా వుంటాను" అని కోరు కునేవారు. నిజమైన స్వేచ్ఛ, భగవంతుని బందీగా వున్నప్పుడే లభిస్తుంది. పూర్తిగా స్వేచ్ఛగా వున్నవారికి దగ్గరిగా వుంటే, మనకూ అదే స్వేచ్ఛ లభిస్తుంది. అయితే, మనం ఎంత దగ్గరగా వున్నాము అన్న దాని మీద అది ఆధారపడి వుంటుంది. ప్రధానమంత్రి కార్యాలయంలో, 'ప్యూన్'గా వున్న వ్యక్తికి జీతం తక్కువగా వుండ వచ్చు గాని, అతనిని మంచి చేసుకోవాలని, మంత్రులు కూడా ప్రయత్నిస్తారు. కారణమేమిటంటే, మంత్రులైనా సరే, ప్రధానమంత్రిని కలవాలంటే, అలా వుండక తప్పదు. అతను 'ప్యూన్' అయినప్పటికీ, అప్పుడు ముఖ్యమైన వ్యక్తిగా చలామణి అవుతాడు.

ఉదాహరణకు, పక్షులంటే చాలా భయపడే పాము, గ్రద్ద కనిపించగానే, బిలంలోకి దూరుతుంది. అదే ఈశ్వరుని మెడను చుట్టుకున్న పాము, ఆకాశంలో ఎగురుతూ కనిపించిన గరుడపక్షిని, నిర్భయంగా కుశల ప్రశ్నలు వేస్తుంది. తాను శివునికి దగ్గరగా వున్నందున, గరుడపక్షి తనను ఏమీ చేయలేదని ధైర్యంతో అలాగ ప్రవర్తిస్తుంది.

## సత్సంగం

సత్సంగం యొక్క ప్రాముఖ్యతను మహర్షి ఎప్పుడూ నొక్కి చెప్పేవారు. సత్సంగం ఎంత అవసరమో మాటల్లో చెప్పలేము. సత్సంగ సమయం ఏ ముప్పావు గంటో లేదా ఒక గంట పాటో వున్నప్పటికీ, దాని ప్రభావం ఎంతోసేపు వుంటుంది. చాలా కాలం పాటు, సత్సంగపు ఆలోచనలు స్మృతిలో వుంటాయి.

ఆదిశంకరులు, జీవన్ముక్తికి మూలాధారం, సత్సంగం అన్నారు. గురువు అనుగ్రహం వున్నప్పుడు, మనకు సత్సంగంలో పాల్గొనే ప్రాప్తి లభిస్తుంది. మన సంకల్పం కారణం కాదు. కొన్ని సందర్భాలలో, సత్సంగంలో పాల్గొనాలని అనుకొన్నప్పటికీ, వీలు కుదరదు. మరికొన్ని సమయాలలో, మనం తలచుకోనప్పటికీ, సత్సంగ అవకాశం లభిస్తుంది. నిజమైన జ్ఞానులు, తమకు అహం లేని కారణంగా, యితరులు యివ్వలేనివి కూడా వారు యివ్వ గలరు. అలాగని, మనం ఏమీ చేయలేనివారమని, కాబట్టి, ఏమీ చేయకుండా వుండమని అర్థం కాదు. మన విధులను మనం, శక్తి

కొలది, చేస్తూనే వుండాలి. ఫలితం, భగవంతుని చేతిలో వుంటుందని గ్రహించాలి. బిడ్డలు, మన ద్వారా ఈ లోకంలోకి వచ్చారు. కాని, వాళ్ళు, మన స్వంతం అని అనుకోవడానికి వీలులేదు. ప్రతి ఒక్క విషయాన్నీ అలాగే పరిగణించాలి. భార్యాభర్తల సంబంధాలు కూడా అదే కోవకు చెందుతాయి.

ఈ ప్రపంచంలో, దేనినీ మనదని పట్టుకు కూర్చుంటే కుదరదు. అహం నశించినప్పుడు, నమ్రత తనంత తానే ఏర్పడి, మనము, మనది అన్న భావన నశిస్తుంది. మనకు, ఈ ప్రపంచంలో ధనాన్ని పోగొట్టుకొనుటకంటే, మనవాళ్ళు లేకపోయారనే భావన ఎక్కువ బాధ కలిగిస్తుంది. కాని, సందర్భాలు ఎలా మారినా, అది దైవ కృప వల్లనే అన్న అభిప్రాయం స్థిరమైనప్పుడు, మన దృక్పథం మారుతుంది.

పరిస్థితులు ఎలాగ మారినప్పటికీ, ఉన్నది వున్నట్లు వాటిని అంగీకరించటమే, నిజమైన మానసిక బలం. కర్తురాజ్ఞయా ప్రాప్యతే ఫలం - భగవంతుని ఆజ్ఞ వలననే కర్మ యొక్క ఫలితాలు ప్రాప్తించ బడును. మన విధి నిర్వహణలో మాత్రం ఏ లోటు వుండకూడదు. భగవంతుడు మనం కోరినవన్నీ ప్రసాదించకపోవచ్చు కాని, మనం మన పనిలో ఎంతగా మునిగిపోయినప్పటికీ, మనకు అసాధారణ శాంతి వుండేలా చూస్తాడు. ప్రశాంతంగా వున్నవారే, యితరులకు శాంతిని యివ్వగలరు. మన కోరికలను సంపూర్ణంగా సిద్ధింప చేయలేకపోవచ్చును కాని, మనకు నిజంగా ఏది అవసరమో, దానిని మాత్రం భగవంతుడు మనకు లభింప జేస్తాడు.

## శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# మేజర్ జనరల్ వి.ఎన్. పరమేశ్వరన్ పిళ్ళై

**శ్రీమతి మల్లాది ఫణిమాల**

మేజర్ జనరల్ వి.ఎన్. పరమేశ్వరన్ పిళ్ళై, పూర్వం వున్న ట్రావెన్కోర్ స్టేట్ (అంటే కేరళ) సేనలకి జి.ఓ.సి.గా పనిచేసి రిటైర్ అయ్యారు. భక్తి బీజాలతో పుట్టిన వారికి, భక్తిమాత జీవితాంతం తోడునీడగా ఉంటుంది అని అనడానికి, శ్రీ పరమేశ్వరన్ పిళ్ళై గారు ఒక చక్కటి ఉదాహరణ. వీరు ఉద్యోగంలో వున్నంత కాలం కూడా, ఎంతో ధార్మిక ప్రవృత్తిని కనపరిచేవారు. ఆత్మ నిష్ఠులైన మహాత్ములను గురువుగా ఆరాధించి జీవితాన్ని గడిపే భక్తుల యొక్క సమస్త కోరికలను, గురువులే నెరవేరుస్తారు అన్నది సత్యం. భక్తులు నోరు తెరిచి అడిగినా అడగకపోయినా, వారి మనసులో ఉన్న కోరికలను మహాత్ములు ఇట్టే గ్రహించి, వాళ్లను ఆదుకుంటారు అని అనడానికి, శ్రీ పరమేశ్వరన్ పిళ్ళైగారి జీవితంలో అనేక సందర్భాలు చోటు చేసుకున్నాయి. 1958వ సంవత్సరంలో, వీరు సన్యాసాశ్రమాన్ని స్వీకరించిన తర్వాత, వీరికి 'స్వామి పరేశానంద'గా సన్యాసనామం సార్థకమైనది.

శ్రీ పరమేశ్వరన్ పిళ్ళై, 1936లో, ట్రావెన్కోర్ స్టేట్ సైన్యంలో కెప్టెనుగా వుండేవారు. మహారాజుకి ఎ.డి.సి.గా వ్యవహరిస్తున్న రోజుల్లో, ఒకసారి మహారాజూ, రాజమాతా మద్రాసు వెళ్లారు. అక్కడి నుండి శ్రీరమణాశ్రమానికి కూడా వెళ్ళారు. మహారాజు తిరిగి వచ్చాక, వారి యాత్రా విశేషాలన్నీ పరమేశ్వరన్ పిళ్ళై గారికి చెప్ప

నారంభించారు. ఆ కబుర్లన్నీ విన్నాక, రమణులంతటి జ్ఞాని సన్నిధానానికి వెళ్లే భాగ్యం లేకపోయిందే, అని పిళ్ళై గారు బాధ పడ్డారు.

"నన్ను కూడా ఆ పర్యటనకి వాళ్ళు తీసుకుని వెళ్ళకపోవటం నా దురదృష్టం కదా!" అనుకున్నారు వారు. ఆ తరువాత ఒకనాడు, సంస్థానాధికారిగా పనిచేస్తున్న పరమేశ్వరన్ పిళ్ళై గారి స్నేహితుడు, శ్రీ నారాయణ పిళ్ళై, తాను రమణాశ్రమానికి బయలుదేరుతున్నా ననీ, పరమేశ్వరన్‌కు కూడా వచ్చే ఉద్దేశం వున్నదా అని అడిగారు. వారి చిరకాల కోరిక తీరబోతోందని ఆనందం కలిగినప్పటికీ, అంత తక్కువ వ్యవధిలో వారికి సెలవు దొరుకుతుందా అని అనుమానం కలిగింది.

కొంత సేపటికి పరమేశ్వరన్ పిళ్ళై రాజభవనానికి వెళ్లారు. అక్కడ మహారాజు తనంతట తానే, మీరు కావాలనుకుంటే శ్రీ రమణాశ్రమానికి నారాయణ పిళ్ళైతోబాటు వెళ్ళవచ్చు అన్నారు. అనుకోకుండా వచ్చిన ఈ అనుమతికి, కాస్సేపు పరమేశ్వరన్ గారి నోట మాటరాలేదు. భక్తులు నోరు తెరిచి అడిగినా అడగకపోయినా, వారి మనసులో ఉన్న కోరికలను మహాత్ములు ఇట్టే గ్రహించి వాళ్లను ఆదుకుంటారు అని నిరూపణ అయ్యింది. శ్రీ రమణుల దివ్య చరిత్రలోని ప్రతి అంశం వలె, వారికి భక్తులపై వున్న ప్రేమ వర్ణనా తీతం. భక్తులపై అనేక రకాలుగా శ్రీ రమణులు, వారి కరుణను కురిపిస్తూనే ఉంటారు. భక్తుల జీవితాలలో, వారి అనుగ్రహం లేకుండా ఒక్క క్షణమైనా దొర్లదు. వారి అనుగ్రహ వీక్షణం చేత,

ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ, శ్రీ రమణులు, భక్తులకు ఆధ్యాత్మిక పుష్టిని కలిగిస్తూనే వుంటారు.

నారాయణ పిళ్ళై, మరియు పరమేశ్వరన్ పిళ్ళై ఆశ్రమాన్ని చేరుకున్నారు. నారాయణ పిళ్ళై అక్కడికి తరచు వెళ్తూండే వారే కాబట్టి, బసకి సమస్యలేకపోయింది. వాళ్ళిద్దరూ, శ్రీ భగవాన్ దర్శనానికై హాలులోకి వెళ్లారు. ఆ హాలు నిండా సందర్శకులున్నారు. శ్రీరమణ 'హృత్' సభ తీరి వుండడాన్ని వాళ్ళు ఇరువురు గమనించారు. శ్రీ రమణులు, షోడశ కళా ప్రపూర్ణులై, సుఖాసనంలో కూర్చుని ఉన్నారు. వారి చుట్టూ, వారి స్పర్శ, నయన దీక్షకై ఎదురు చూస్తున్న కొంతమంది భక్తులు, ముకుళిత హస్తాలతో, నతమస్తకం తో, వినమ్రగాత్రులై నిలిచి వున్న మరికొందరు భక్తులను గమనించారు. ఈ రమణీయ దృశ్యాన్ని ఆస్వాదిస్తూ, నారాయణ పిళ్ళై, పరమేశ్వరన్ పిళ్ళై - వీరిరువురు అచేతనంగా, అలౌకిక శాంతి తీరాలకు చేరుకున్నారు. హాలులో కూర్చుని వున్న శ్రీ రమణులను దర్శించుకున్న తరుణంలో, శ్రీ దక్షిణామూర్తి స్తోత్రంలోని శ్లోకాలు, పరమేశ్వరన్ పిళ్ళైకి గుర్తు వచ్చాయి. ఆ సోఫామీద, సాక్షాత్తూ శ్రీ దక్షిణామూర్తియే చేరగిలబడి కూర్చున్నారనిపించింది వారికి.

శ్రీ రమణులు కొలువుతీరిన ఆ భక్తి సభలో, నారాయణ పిళ్ళై, పరమేశ్వరన్ పిళ్ళై వెళ్లి కూర్చున్నారు. శ్రీ భగవాన్ వాళ్ళిద్దరినీ గమనించారు. కాసేపటి తరువాత, పరమేశ్వరన్ పిళ్ళైని రమ్మని సంజ్ఞ చేశారు. యిద్దరిలో ఎవరిని రమ్మన్నారో తేల్చుకోలేకపోయారు వారు. నారాయణ ఎప్పుడూ వెళ్తూండేవారు కాబట్టి వారు లేచారు.

ఇంతలోనే శ్రీభగవాన్, "నీవు కాదు" అన్నట్లు సంజ్ఞ చేశారు. పరమేశ్వరన్‌ని చూపారు. కొత్తగా వచ్చిన వారు అవ్వటం వల్ల అందరికీ ఆశ్చర్యం కలిగింది. పరమేశ్వరన్ ఎవరో తెలుసుకోవాలని అందరికీ అనిపించింది. అందరిలాగానే పరమేశ్వరన్ గారు కూడా ఆశ్చర్యపోయారు. వారికి ప్రణమిల్లిన తరువాత, పరమేశ్వరన్ గారిని దగ్గరికి రమ్మంటూ, శ్రీ రమణులు సంజ్ఞ చేశారు. వారివైపు తేరిపార చూసి, రమణులు చిరునవ్వు నవ్వారు. పరిచారకునితో, "ఈ పుస్తకాన్ని పట్టుకురా" అన్నారు. అతను పుస్తకాన్ని తెచ్చాడు. దానిని పరమేశ్వరన్ గారికి మహర్షి బహూకరిచారు. శ్రీ భగవాన్ తమిళంలో వ్రాసిన గీతాసారం గ్రంథానికి, అది మలయాళ అనువాదం. అంతు లేని ఆనందము, సంతృప్తి, పరమేశ్వరన్ పిళ్ళైని ముంచివేశాయి.

మధ్యాహ్నాభోజనవేళ అయింది. భోజనశాలలో తమకి ఎదురుగా వున్న వరుసలో కూర్చోమని, మహర్షి పరమేశ్వరన్ గారికి చెప్పారు. భోంచేస్తుండగా, ఎంతో మృదువుగా, వంట ఎట్లా వున్నదని కూడా అడిగారు. ఇట్లాగే యింకా ఏవో అడిగారు. కావలసినంత అన్నమూ, కూరా తీసుకొని మెల్లగా తినమన్నారు. అంతసేపూ పరమేశ్వరన్‌తోనే ముచ్చటించారు.

మొట్టమొదటిసారిగా వారి సన్నిధికి వచ్చిన భక్తుని పైన కూడా ఇంత కరుణను కురిపించగలరా! అని అనిపించేటట్లు, పరమేశ్వరన్‌తో శ్రీ రమణులు మెలిగారు. "శ్రీ రమణుల దర్శనం చేసుకున్న వారు ఊరికే పోలేరు! దుఃఖితులు ఆనందులవుతారు. నాస్తికులు ఆస్తికులుగా మారతారు. మరి, ఆస్తికులేమో భక్తులుగా పరిణతి చెందుతారు. భక్తులు యోగులుగా ఉద్ధరింపబడతారు. యోగులు

జ్ఞానులవుతారు!'' అని శ్రీ రమణుల సన్నిధి విశేషమును గురించి పరమేశ్వరన్ విన్నదంతా నెమరు వేసుకున్నారు. సద్గురు రమణులతో ఆశ్రమంలో గడిపిన ప్రతి క్షణము, ఒక దివ్య మధురానుభూతిగా వారి మనోఫలకం పై ముద్రింపబడినది. వారి భక్తులకు, రమణులు అనేక విధాల తమ అనుగ్రహాన్ని ప్రసాదించినా, అందులో ఎటువంటి అట్టహాసం వుండదు. అతులితమైన వారి అనుగ్రహంలో, నిరాడంబరత్వము, వాత్సల్యము గోచరిస్తాయి అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేనే లేదు.

నారాయణ పిళ్ళై, ఆశ్రమానికి తరచూ వస్తూండేవారే. అయినప్పటికీ, మహర్షి అతనితో ఏమీ మాట్లాడనేలేదు. పరమేశ్వరన్ పట్ల మహర్షి అంత శ్రద్ధా, వాత్సల్యాలు చూపటం వల్ల, తనలో ఏదో లోపముందని నారాయణ అనుకున్నారు. ఇది నిజానికి సహజమే కదా... శ్రీ రమణాశ్రమం చేరుకుని, శ్రీ రమణుల సన్నిధిలో కొంతకాలం గడపాలనుకునే ప్రతి భక్తుడికి, వారి అనుగ్రహ వాత్సల్యములను సంపూర్ణ స్థాయిలో అనుభవించాలని ఉంటుంది మరి! అదే విధంగా, శ్రీ రమణులు నారాయణతో ఏ మాత్రం ముచ్చటించకపోవడం చేత, తనలో ఏదో లోపం వున్నదని నారాయణ చిన్నబుచ్చుకున్నారు. మహర్షికి ఇది తేలికగా అర్థమయింది. అదేరోజు శ్రీరమణులు, నారాయణకి ఒక పుస్తకాన్ని బహూకరించి, అతనిని కూడ సంతృప్తుణ్ణి చేశారు. అద్వితీయులైన శ్రీ రమణుల దర్శనం చేసుకున్న భక్తులను, వారు ఏ విధంగా అనుగ్రహిస్తారో, మన పరిమితమైన మానవమేధస్సుకు అగోచరము.

# కాళీ విద్య - సదాచార బోధిని

శ్రీమతి అయ్యల సోమయాజుల రేణుక

శ్లో: యే కాలీ పదవేషం నాలీకం ప్రణమన్తి ।
నైషాం కించిదశక్యం నాలీకం మమవాక్యమ్ ॥

(కాళీదేవి పాదాలకు నిజమైన భక్తితో ప్రణామము చేసిన వారికి శక్యము కానిదేదీ లేదు)

పరాశక్తి, ముందుగా సృష్టి రచనా నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నది. కాలము అనగా విజ్ఞానము. ‘‘ఆత్మనః విజ్ఞానధారః కాలః’’ (ఆత్మ నుండి నిరంతరమూ ప్రసరితమగు విజ్ఞానధారయే కాలము) అని శ్రీ గణపతి ముని, ‘‘మనీషా సంగ్రహః’’ అనే సూత్ర గ్రంథములో తెలియచేసి వున్నారు. భూత, భవిష్యత్, వర్తమానముల తోనూ, పుట్టుట, పెరుగుట, నశించుట అను దశలతోనూ తిరుగు కాలచక్రమును కూడ, కాలమనియే యందురు. ఇలా, లోక సంవిధాన ప్రక్రియకు మూలపురుషుడుగా ఈశ్వరుడు ‘‘కాళుడు’’ కాగా, పరాశక్తి ‘‘కాళి’’ అయినది.

దశమహా విద్యలలో మొదటిది ‘‘కాళీవిద్య’’. అర్చనా సౌలభ్యానికని, ఆమెకొక రూపాన్ని కల్పించారు. అందు, ఆమె శరీర చ్ఛాయను ముదురు నీలము లేక నలుపుగా చెప్పబడింది. ఏది మన ఊహలకు అందనిదో, అది చీకటి వంటిది. కావున, కాల స్వరూపమైన కాళికాదేవిని, నల్లగా వర్ణించి యున్నారు. కాలానికి ఆమె నాయిక అన్న సత్యం, ఇందు దాగి వున్నది. సృష్టి యొక్క

భ్రమణమును తెలిపేది, ఆమె యొక్క ఎఱ్ఱని నాలుక. మెడలో ధరించిన కపాలముల దండ, వస్తువుల జడత్వాన్ని తెలియ చేస్తున్నది. వాటికి ప్రాణం పోసే శక్తిగా ఆమె అభయ ముద్రను ధరించుట, సంహారక చిహ్నముగా వీరముద్రను ధరించుట విశేషము. నాలుగు భుజాలు, సర్వ వ్యాపకత్వాన్ని తెలియ చేస్తున్నాయి. చేతియందలి ఖడ్గము, ఆమె యొక్క నిశితమైన దృక్పథానికి ప్రతీక.

గాఢమైన నిద్రలో దేహాత్మభావం వుండదు. ప్రపంచం కనిపించదు. తలంపులుండవు. ఒకానొక సుఖమైన లయావస్థలో మానవుడు వుంటాడు. మరణం కూడా అటువంటిదే. అది యొక సుదీర్ఘమైన విశ్రాంతి. ''నేను'' అనే భావం లేచినప్పుడు అన్నీ కనిపిస్తాయి. కావున మానవుడు ధరించిన ఉపాధికే సంహారం వర్తిస్తుంది. లోకాల విషయములోనూ అంతే. సృష్టి-స్థితి-సంహార ములు అనేవి సృష్టి ధర్మం. ఆ ధర్మాన్ని కాళీమాత నిర్వర్తిస్తున్నది. అందుచేతనే ఆమెను సంగ్రామశక్తి అని అన్నారు. యోగులందు జరిగే మనో నాశనం కూడా సంహారమే. ఆ పరాశక్తి మెడలోని ముండ మాలలు, జడతత్వం గల వస్తువులకే సంగ్రామము అన్న సత్యాన్ని తెలియచేస్తున్నాయి. అండ, పిండాండముల సంహారాన్ని కాళికాదేవి చేస్తున్నది.

ఈశ్వరుడు 'మహాకాళుడు, మహాకారణకర్త'. అతని నుండే శక్తి ప్రవహించుచున్నది. కాబట్టి, కార్య నిర్వహణ భారము కాళికా దేవి కాగా, ఈశుడు మూల పురుషుడైన 'మహాకర్త' అగుచున్నాడు.

వాయువు వలె, 'నేను' అంతటా వ్యాప్తి చెందుతాను అని, అతడు సర్వ వ్యాప్తం అగుచున్నాడు. అన్నింటికీ మూలక్షేత్రమైన 'ఆకాశము' తల్లి వంటిది. అందు వాయు దమనం చేయువాడుగా ఈశునకు 'మాతరిశ్వ' అని పేరు వచ్చింది. వేదములలో ఈశుని నామధేయం 'ఇంద్రుడు'. 'ఇంద్రోవిశ్వస్యరాజతి' అన్న గణపతి మునీంద్రుల వాక్యములో ఈ రహస్యం దాగి వున్నది. ఈ విధముగా పరమ కారణత్వం ఈశునకు చెందుతున్నది.

అన్ని రసములనూ అనుగ్రహించే దేవత కాళిక. ఆమె కృపారస సౌలభ్యాన్ని పొందటానికి, తాన్త్రిక విద్యలో చెప్పబడిన మన్త్రం "క్రీం" అను అక్షరం. మంత్రముపై దృష్టి నుంచి, ఏకాగ్రతతో మంత్రజపం చేయాలి. రసములు కలది 'రసజ్ఞ' కావున అన్ని కళలూ హస్తగతం అవుతాయి.

రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి ఎందరో ఆధ్యాత్మిక ఋషిపుంగవులకు, దేశభక్తులకు జన్మ నిచ్చినటువంటి పుణ్యభూమి బెంగాలు రాష్ట్రము. దేవీ నవరాత్రి ఉత్సవాలు ఇచట విశేషముగ జరుపుతారన్న విషయము అందరికీ తెలిసినదే. పరమేశ్వరీ కటాక్ష విలసితమై, దశమహా విద్యలందు మొదటి విద్యకు అధికారిణియైన కాళీమాత యొప్పు ఆ పుణ్య స్థల దర్శన మాహాత్మ్యమును, గణపతి ముని ఇలా కొనియాడుతారు.

శ్లో: సంగీయ మానం స్థల మార్యబృందైః
బృందారకాణాం సరిత స్తటేస్తి

యః కాళికాం పశ్యతి కాలకేశీం
తత్రాస్య కాలాదపి నైవ భీతిః

(ఆర్య సంఘముల చేత సంకీర్తింపబడుచున్న క్షేత్రము, దేవనదీ తీరమందున్నది. అక్కడ, నల్లని జుట్టు గల కాళిని సందర్శించిన భాగ్యశాలికి, కాలుని వలన కూడా భీతి కలగదు).

విచిత్రవేమిటంటే, ఈ పరాశక్తి, కాళీఘాట్ యందు మంత్ర-తంత్ర విధానముల పూజలనందుకొనుచు, భీకర స్వరూపమున కనపడును. అటు దక్షిణేశ్వరము నందు, మందస్మిత వదనయై, చిన్మయ కళలతో చిందులాడుచుండును. కాల స్వరూపము ఒకరైన, శాంత స్వరూపిణి యింకొకరు. ఒకామె, జంతువుల రుధిరమును ద్రావు "రక్త పిపాసిని" వలె కనబడితే, మరియొకామె, శ్రీ రామకృష్ణుని నైవేద్యము నారగించి, శుద్ధ స్వరూపిణి యైనది కాబోలు. కరుణారస ప్రపూర్ణ చక్షువుల హృదయ తాపమును హరించు దేవతవలె కనపడును. కాలము యొక్క భీకర స్వరూపమెుకరైన, ప్రశాంత స్వరూపము ఇంకొకరు. అయినను, ఇద్దరూ భక్త వర ప్రదాతలే. ఇరువురునూ కరుణా మూర్తులే. కాళీఘాట్ నందు, ఆ కరుణామూర్తిని హృత్పీఠంపై నిలిపి, ధ్యానం చేసి కళ్ళు తెరచిన గణపతి మునికి, ఒక భీకరమైన దృశ్యము కనిపించినది. ఒక ఎనుబోతు, బలిపీఠం పై కట్టబడి వున్నది. దానిని పసుపు, కుంకుమలతో అలంకరించి, బలినిచ్చుటకై నిలబెట్టి యున్నారు. ఆ అమాయక ప్రాణి, బిత్తర చూపులతో, రక్షణ కోరుతున్నట్లు అనిపించింది గణపతికి.

అమ్మా! ఏమిటీ దారుణము! భక్త వర ప్రదాత్రివే! అందరినీ చల్లగా చూసే నీవే, రక్త పిపాసినివై ఉండుట ధర్మమా? అంధకారమున, మూఢాచారములలో మునిగిన యీ ప్రజానీకానికి జ్ఞానం కలిగించవా! అని అమ్మను వేడిన గణపతి - “ఆపండి! దేవీ ప్రసన్నమునకని యీ జంతువును బలి ఇత్తురా! జీవహింస పాపము కదా! వదిలివేయుడు” అని అపర పరశురాముడు వలె అరిచాడు. అందరి దృష్టి గణపతిపై పడినది. అంతటితో ఆగకుండా, “మీకు బలియే ప్రధానమైన నన్ను బలి ఈయండి” అని బలిపీఠంపై తన తలను పెడతారు గణపతి ముని. అంతేకానీ, జీవహింస సహించను అని మొండి కెత్తటంతో, చివరికి ఆ రోజు బలి జరుగలేదు. కొందరు అపచారమని దూషించారు. కొందరు శ్లాఘించారు.

గణపతి యందలి సాంఘిక దృష్టికి, ఇది అంకురార్పణ. అంతవరకూ, తపస్సు తప్ప అన్యము నెరుగని అతనియందు, సంఘ సేవా దృక్పథం కలిగింది. వేదోక్తమయిన క్రతువుల యందు నవ ధాన్యములను బలి ఇచ్చుటయే ఆచారము కాని, జీవహింస ప్రోత్సహింపబడలేదనునది అతని వాదన. “మతము” అనగా అభిప్రాయము అని అర్థము. ప్రాణి యొక్క మనస్సు, బుద్ధి పరిపక్వతలను బట్టి, అభిప్రాయములందు ఔన్నత్యము కనిపించును. కావున, అందరికినీ ముఖ్యముగా కావలసినది. సరళమైన ఆచార ప్రక్రియ. అది సత్య శోధనకు దారితీయును.

అన్నము, కూర, ఇలా పదార్థములను వేరు వేరుగా వడ్డించినా, శ్రీ భగవాన్ అన్నింటినీ కలిపి ఒక పట్టెడు ముద్దను ఆరగించేవారు. ఎందుకని అడుగగా "ఇప్పటికే నానాత్వము అధికమైపోయినది. ఇక్కడ కూడా అదేనా!" అని అనేవారు.

మూఢమైన మతాచారాలకు, విపరీతమైన ప్రామాణిక బుద్ధియే కారణమని తలంచి, గణపతి ముని 102 శ్లోకములు గల "సదాచార బోధిని" అను గ్రంథమును వ్రాస్తారు. అందు, ఆచారములను - కర్మాచారము, జ్ఞానాచారము, మన ఆచారము అని మూడు వర్గములుగా వివరించి యున్నారు.

ఈ విధముగా, 14 యేండ్ల వయస్సు లోనే, విప్లవాత్మక భావములను కల్గి, ఛాందస వాదముపై సవాల్ చేసిన కవి కులపతి - మన గణపతి ముని.

ఓం నమో భగవతే శ్రీ రమణాయ.

## పాఠకులకు గమనిక

పై నెల (జూన్ 2024) శ్రీ రమణ జ్యోతి సంచిక మొదలు కుని, ధారావాహికంగా ప్రతి నెల, శ్రీ రమణాశ్రమం వారు ప్రచురించిన ప్రముఖ ఆంగ్ల గ్రంథాలను, మన రమణ భక్తులు తెలుగులోకి అనువాదం చేసినవి, రమణ జ్యోతి పత్రికలో ప్రచురితమవుతాయి. పాఠకులకు అనువాద వ్యాసాలూ ఉపయుక్తంగా వుంటాయని ఆశిస్తున్నాము. - సంపాదకులు

# శ్రీ భగవాన్‌తో గ్రిద్దలూరి కుటుంబం అనుబంధం

(గత సంచిక తరువాయి) శ్రీ గ్రిద్దలూరి కృష్ణమూర్తి

ఆ యోగా సెంటరుకు కూడా పోయేవాడిని. అక్కడకు వెళ్ళినప్పుడు మీరు ఎక్కడ నుండి వచ్చారు అని నన్ను అడిగారు. నేను నెల్లూరు నుండి వచ్చాను అని అంటే, వారు, నెల్లూరులో పుచ్చలపల్లి రామచంద్రా రెడ్డి గారని వున్నారు, వారి దగ్గరకు వెళ్లి మీరు ప్రార్థన చేసుకోండి అని నాతో చెప్పారు. దాంతో నేను నెల్లూరు వచ్చిన తరువాత ఆయన దగ్గరకు వెళ్లాను. వారితో నేను, సాంబశివరావు గారి తమ్ముడి కొడుకునండి, కుంభకోణం వెళితే అక్కడివారు నన్ను మిమ్మల్ని కలవమని చెప్పారు అని అంటే, వారు రా నాయనా అని చెప్పి, 'నేను ఉదయం 6 గంటలకు మరియు సాయంత్రము 6 గంటలకు ప్రార్థనకు కూర్చుంటాను' అని చెప్పారు. దాంతో ఒకరోజు ప్రొద్దునే వెళ్లి వారి ప్రక్కన కూర్చుందామని అనుకొంటే, వారు నా ఎదురుగా కూర్చో నాయనా అని చెప్పి, ఒక గంట ప్రార్థన చేశారు. వారి ప్రార్థనతో నా నోరంతా ఒక్కసారిగా అమృతమయమైనట్లు అనిపించింది. 25 రోజుల వరకూ ఆ తీయదనం తగ్గలేదు. మా పెదనాయన గారికి ఒంట్లో బాగోలేకపోతే, రామచంద్రా రెడ్డి గారిని ఒకసారి రమ్మనమని అడిగాను. వారు వస్తానని అంటున్నారు కానీ 10 రోజులు రాలేదు. ఎందుకు రావట్లేదు అని అడిగితే, రావాలనే ఆలోచన రావట్లేదు, అందువల్ల రాలేదు అని చెప్పారు. ఒక రోజున నేను ఇంట్లో లేని సమయంలో వారొచ్చారు. మా పెదనాయన గారితో మాట్లాడాను.

వారు వెళ్లిపోయిన తరువాత కొంతసేపటికి నేను ఇంటికి వస్తే, మా పెదనాయన నన్ను పిలిచి, 'రామచంద్రా రెడ్డి గారు బ్రహ్మజ్ఞాని' అని అన్నారు. అటువంటి మహానుభావులతో ప్రార్థన చేసుకోవటం ఎంతో అదృష్టం అని అనిపించింది. మా పెదనాయన గారు, 1962 లో కాలం చేశారు.

**అంతర్ముఖం :**

1963లో ఒకసారి నేను ఒక అర్జెంట్ పని మీద రమణాశ్రమం వెళ్ళవలసి వచ్చింది. అక్కడి పాత ఆఫీసు హాలులో టైపురైటర్ మీద టైపు చేస్తూ వుంటే, ఒక్కసారిగా మనస్సు అంతర్ముఖం అయ్యింది. ఇదంతా భగవాన్ అనుగ్రహమే. మనస్సు అంతర్ముఖం కావటం భగవాన్ అనుగ్రహం వల్ల తప్ప, మన ప్రయత్నాల వల్ల కాదు. మనస్సు అంతర్ముఖం చెందటం కోసం, నన్ను అక్కడకు భగవాన్ పిలిపించినట్లు వున్నారు అని నాకనిపించింది.

**వేటూరి ప్రభాకర శాస్త్రి గారి కుటుంబముతో సాన్నిహిత్యం:**

చంద్రకాంతమ్మ గారు నేర్పిన ప్రార్థనను ప్రతీ రోజు ఉదయం, సాయంకాలం చేసస్తూ వున్నాను. 1964లో మా వివాహం నిశ్చయమైనది. మా పెళ్ళికి రావాలని రామచంద్రా రెడ్డి గారిని కోరితే, 'నేనిక్కడ కూర్చుని ప్రార్థన చేస్తాను, నువ్వు వెళ్ళు' అని అన్నారు. పెళ్ళైన తరువాత ఉద్యోగరీత్యా హైదరాబాదుకు వస్తూ వుంటే, నాకు మాస్టర్ సి.వి.వి. గారి యోగ మార్గంలో ప్రథమ గురువైన చంద్రకాంతమ్మ గారు ఇలా అన్నారు: ''నాయనా! నా గురువుగారి కుటుంబం (అంటే ప్రభాకర శాస్త్రి గారి పెద్ద కొడుకు,

శాస్త్రి గారి శ్రీమతి) అక్కడ వున్నది అని చెప్పారు. నీవు వెళ్లి వారింట్లో ప్రార్థన చేసుకో'' అని చెప్పారు. దాంతో మొదట్లో ప్రతీ నెలకొకసారి వారింటికి వచ్చేవాడిని. ఆ తరువాత కొంతకాలానికి ప్రతీ వారం వచ్చేవాడిని. గురుసన్నిధి కాబట్టి, సాధనలో లోపం లేకుండా, మనకిచ్చిన మార్గాన్ని శ్రద్ధా, భక్తితో సాధన చేయటమే మన పని అని అనుకొన్నాను. అలా ప్రతీ రోజు, ఉదయం, సాయంత్రం ప్రార్థన చేస్తూ వున్నాను. జీవితంలో ఎన్నో ఆటుపోట్లకు గురవుతున్నా, ప్రార్థన చేస్తూ వున్నప్పుడు నాకు భగవానే కనపడుతూ వుంటారు. నేను భగవాన్ అని అంటే, 'భగవాన్ అనబోకు, మాస్టర్ అని అంటూ వుండు' అని భగవాన్ లోపలి నుండి నన్ను కరెక్ట్ చేస్తూ వుండేవారు. భగవాన్‌కు ప్రతీ రోజు దణ్ణం పెడుతూ వుంటే, 'మాస్టర్ గారికి దణ్ణం పెడితే నాకు పెట్టినట్లే' అని భగవాన్ నన్ను కరెక్ట్ చేసేవారు. ఆ విధంగా ఈ రోజు వరకూ మమ్మల్ని కాపాడుతూ వస్తున్నారు రమణ భగవాన్. నాకెందుకులే, వాళ్ళు వేరే గురువును పట్టుకొన్నారని వదిలివేయ లేదు. అంటే గురువులు వేరు కానీ, వారి తత్త్వం ఒకటే. తెర మీద బొమ్మలు వేరు కానీ, తెర ఒక్కటే. ఆత్మ అనేది ఒక్కటే. భగవాన్, శరీరంలో 54 సంవత్సరాలు వున్నా, దేహ త్యాగ సమయంలో, తన స్వరూపాన్ని ఒక జ్యోతి రూపంగా బయటకు వచ్చి చూపించి, ఇంతవరకూ ఆధ్యాత్మిక చరిత్రలో ఎవ్వరూ చూపించనిది చూపించారు. అది ఒక్క భగవాన్‌కే చెల్లింది. పరమాత్మ తత్త్వాన్ని, అన్ని రకాలుగా ప్రాక్టికల్‌గా చూపించింది రమణ భగవాన్ ఒక్కరే.

**ఇష్ట దైవానికి అర్పణం:**

నేను ఒకసారి మా గురువైన చంద్రకాంతమ్మ గారి దగ్గర నుండి ప్రార్థన చేసుకొని వచ్చి, భోజనం చేద్దామని ముద్దను కలిపి నోట్లో పెట్టుకోబోతూ వుంటే, లోపల నుండి ఒక మాట వినిపించింది: "నువ్వు తినేదానిని మాస్టర్‌కు నివేదించు అని". అప్పటినుండి నేను ఏ ఆహారము తీసుకున్నా, మాస్టర్ గారికి నివేదించి తీసుకుంటాను. రెండు రోజుల తరువాత ఆ మహా ఇల్లాలు నా దగ్గరకు వచ్చి, "నాయనా నువ్వు గురువుగారికి సమర్పించి ఆహారం తీసుకుంటున్నావా?" అని అడిగారు. దాంతో నేను, అమ్మా! నేను మొన్న రాత్రి నుండే ప్రారంభించాను అని చెపితే, ఆవిడ నాతో ఇలా అన్నారు: "నేను మొన్న రాత్రి అనుకున్నాను. అది నీకు చేరిందా లేదా" అని అనుకుంటున్నాను అన్నారు. మాస్టర్ నామం చెప్పుకొని ఏది స్వీకరించినా మనకు ఇబ్బంది వుండదు కానీ, గురువు నామం చెప్పకుండా భుజిస్తే అహంకారాన్ని పెంచి పోషిస్తున్నట్లే. ఇది నేను తెలుసుకొన్నది. గురువు నామం మంచి మందు వంటిది.

కుమార్ పుట్టక మునుపు, మా ఆవిడకు అప్పటికే మూడు అబార్షన్లు అయ్యాయి. నాల్గవసారి ప్రెగ్నెన్సీ వచ్చింది. చంద్రకాంతమ్మ గారికి జాబు వ్రాస్తే, వారు, నాయనా ఈసారి నీకు మగ పిల్లవాడు పుడుతున్నాడు, ఆ పిల్లవానికి "వెంకట ప్రభాకర" అని పేరు పెట్టు అని చెప్పారు. (1968 జులైలో అబ్బాయి - వెంకట ప్రభాకర కుమార్, 1974 మేలో అమ్మాయి - వెంకట నాగలక్ష్మి జన్మించారు). వేటూరి ప్రభాకర శాస్త్రి గారి కుటుంబ సభ్యులు

సుందర మూర్తి గారు, లక్ష్మీదేవి గారు, సుజాతమ్మ గారు వాళ్ళు మమ్మల్ని ఎన్నో రకాలుగా ఆదుకొన్న వాళ్ళు. వేటూరి ప్రభాకర శాస్త్రి గారు, మైనంపాటి నరసింహం గారు, మాస్టారు సి.వి.వి. గారి ద్వారా, డైరెక్ట్‌గా దీక్షను పొందిన వారు. మైనంపాటి నరసింహం గారు, తాను శరీరాన్ని వదిలివేసే 15 సంవత్సరాల క్రితమే, తన డైరీలో ఫలానా సంవత్సరం, ఫలానా తారీఖున, ఫలానా సమయానికి శరీరం వదిలివేస్తానని వ్రాసుకొన్నారు. నరసింహం గారు, ముచికుందుల వారి అంశట.

×××

వేటూరి ప్రభాకర శాస్త్రి గారి శిష్యులు శ్రీనివాసాచార్యులు గారు తిరుపతిలో వుండేవారు. వారు గొప్ప మహానుభావులు. మా గురువుగారైన చంద్రకాంతమ్మ గారు కాలం చేసిన తరువాత, నాకు భౌతికమైన గురువు లేరే అని అనుకొంటూ వుంటే, నెల్లూరులో మా బంధువు శేషయ్య గారు, శ్రీనివాసాచార్యులు గారి గురించి చెప్పి, వారి దగ్గరకు వెళ్ళండి అని చెప్పారు. అలా ఒకరి తరువాత ఒకరి దగ్గరకు, అంటే సజీవ గురువుల దగ్గరికి పంపిస్తూ వున్నారు మాస్టర్ గారు. మాకు ఇబ్బంది ఏదైనా కలిగినప్పుడు శ్రీనివాసా చార్యులు గారికి జాబు వ్రాస్తే, ఆ ఇబ్బంది వెంటనే తీరిపోయేది. ఎన్ని రకాలుగా ఆదుకొన్నారో వారు మమ్మల్ని. మా ఆవిడ డెత్ బెడ్ మీద వున్నప్పుడు ఫోన్ చేస్తే - "ఏం భయపడకు నాయనా, నేనున్నాను కదా" అని అన్నారు. వాళ్ళదంతా యోగమార్గం. ఇవన్నీ తొలగించుకొని వస్తే వచ్చే మెట్టు, భగవాన్ యొక్క జ్ఞాన మార్గం. ఇవన్నీ దాటితే ఆత్మజ్ఞానం ఇస్తాను అని మాస్టరు గారు చెప్పారు.

మాస్టారు అంటే ఆత్మ అని అర్థం. ఆ ఆత్మకు నమస్కారం. నాకు ఇప్పుడు అర్థమైనది ఏమిటంటే - మనం భగవంతునితో అనుబంధం పెట్టుకోవాలి. మనం తినేది ఏదైనా, మన ఇష్ట దైవానికి అర్పించి తీసుకోవాలి. ఎందుకంటే ఇప్పటివరకూ శత్రువులను పోషించాము. మనమెప్పుడైతే మనం తీసుకునే ఆహారం భగవంతునికి అర్పితం చేస్తామో, అది దివ్యమైన మందు అవుతుంది. ఇక రెండవది, పాత వాసనలు కరిగి పోతాయి. క్రొత్తవి రావు. అందుకని భక్తి కలిగిన కూడు పట్టెడైనను చాలు. మనం తినేది, త్రాగేది భగవంతునికి అర్పితం చేయకుండా తీసుకొనటం ఎటువంటిదంటే, 'దేహాత్మ బుద్ధి పోషణతో తనను తాను ఎరుగుట మొసలి మీద ప్రయాణం వంటిది' అని భగవాన్ చెప్పారు. భగవంతునితో కాంటాక్ట్ పెరిగితే, ఆయన చైతన్య ప్రకాశం మన మీద ప్రసరిస్తుంది. భగవాన్ ని, 'నేనెవరు?' అనే విచారణని చేస్తేనే 'నేను' ఎవరో తెలుస్తుందా? లేక ఇతర మార్గాల ద్వారా కూడా తెలుసుకోవచ్చా? అని అడిగితే, భగవాన్, 'ఏ మార్గాన్ని అయినా పట్టుదలతో అనుసరిస్తే అదే నీవైపోతావు' అని చెప్పారు. తలంపులను పెంచి పోషించటమంటే శత్రువులను పెంచి పోషించటం. సాధనా ఫలితమేమిటంటే మంచిగా మాట్లాడటం. చెడుగా మాట్లాడకపోవటం. మనం మాట్లాడదలచుకొంటే లేదా మార్చదలచు కొంటే ఏదైనా విషయాన్ని చెడుగా కాకుండా మంచి మార్గంలో సరిదిద్దాలి. అంతే కానీ, ఒక ప్రక్క సాధన చేస్తూ, ఇంకొక ప్రక్క చెడుగా మాట్లాడటం కానీ, చెడ్డ పనులు చేసినా గానీ ఏమి లాభం?

(సశేషం)

# The Ordinary is Extraordinary

Dr K Subrahmanian

We try hard to think good thoughts, but we soon realise that it is not us, but some other power that makes us think about them.Similarly, our ability to stay calm, even for a short duration, is usually the result of our association with like-minded people. What is important in *satsang* is being together,in silence, with like-minded people. That's why Bhagavan says that *satsang* happens because of grace. The company of like-minded people is possible only through his grace. It is not what is said during the *satsang* that is important, because there is nothing new to be said; but every time we listen to some old truths, we're able to give it a new interpretation. Each one of us reinterprets everything in the light of our experience during that particular period. Also, what we say to one another after the *satsang* is important; for everything has its own effect. Sometimes, we may wonder if it is not enough to go to *satsang* once, and then read the *Gita* once, and then, the *Ramayana*. When we read the *Gita* or the *Ramayana*, we are able to give it a new interpretation every time because these are the words of great *jnanis* and *avatars*. When we read the newspaper, and somebody asks us what the news of the day is, we may reduce all the events to a mere five or six sentences. Sometimes, we even say that there is nothing new. But when we read a *sloka*, we don't say that; we become inspired, and as a result, get a new meaning

every time we read it. We always go to the *sloka* in a different frame of mind – sometimes, we take it up when we are happy, and sometimes when we are unhappy. It is this frame of mind of ours that gives the *sloka* a different interpretation; God interprets it in different ways to us at different times. Every time we revisit the *sloka*, we understand it better and better. We can never say that we have read and understood completely the *Gita* or the *Ramayana*. We can spend the rest of our life reading these two epics, and at the end of our life, we would still not have understood everything, for the possibilities are infinite. We cannot exhaust the *Ramayana* or the *Gita* the way we would a novel or the newspaper.

We sometimes wonder why we have to read them repeatedly. Every day, we have breakfast, tea, lunch and supper, and except on those few special occasions, what we eat daily is more or less the same. We don't, however, consider that to be uninteresting. Every day, in order to sustain our body, we eat rice, but we never ask why it is that we have to eat it daily. Occasionally, to break the monotony, we have something sweet – cake or halwa, for example. When we eat sweets, we become very happy. Although sweets are tasty, it's impossible for a person to live on sweets alone. We can, however, live on rice and a variety of vegetables – things that most people consider uninteresting. It's possible to supplement our diet with vitamin B or C, but we cannot live on vitamins alone. So,

in order to sustain our body, we eat, on a daily basis, ordinary things. What we consider ordinary is extraordinary, because they sustain our body. We never say that eating once a week or so will be enough. If that is so at the physical level, how much more so it is at the mental level! In order to sustain our body, we eat food, and in order to sustain our mind, we read the *Gita*, the *Ramayana*, etc.

